
# ఫ్లాష్ బ్యాక్



**పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం**

# సుందర్ లాల్ నహతా

## నిర్మాత

### ( విజయచిత్ర – 1968, ఆగస్టు సంచిక నుంచీ)



చలనచిత్ర పరిశ్రమకు మూల స్తంభాలు అనదగ్గ వారు పరిశ్రమలో 'కొందరున్నారు. అలా – పరిశ్రమ మనుగడకూ, విస్తరణకూ, కారకులైన వారిలో ఒకరు – సుందర్ లాల్ నహతా, చిత్ర నిర్మాతగా, పంపిణీదారుగా, సలహాదారుగా – ఆయనను పరిశ్రమ చాలా కాలం నుంచి ఎరుగును. వ్యాపారదక్షత, నిర్మాణబాధ్యత, కష్టనష్టాలూ, మంచిచెడ్డలూ, అంచనాలు వెయ్యడంలో సుందర్ లాల్ నహతా గట్టివారు.

చలనచిత్ర పరిశ్రమను – 'పరిశ్రమ' గా మార్చాలనీ, కళాత్మకమైన వ్యాపారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలనీ, లేకపోతే పరిశ్రమ మనలేదనీ ఆయన భావించారు. ఒక భాషలో విజయవంతమైన చిత్రాలను ఇంకో భాషలో నిర్మించడం, తక్కువ వ్యవధిలో చిత్ర నిర్మాణాలను, వంటివి ఎన్నో – ఆయన చేశారు. డిస్ట్రిబ్యూటరుగా ఎన్నో చిత్రాలను ఆయన విడుదల చేశారు; శాంతినివాసం, సతీ అనసూయ, జయం మనదే, గుడి గంటలు, రక్త సంబంధం, మంచి మనసుకు మంచిరోజులు, వీరాభిమన్యు, గూఢచారి – 116 మున్నగు ఎన్ని చిత్రాలకో ఆయన నిర్మాత.

సుందర్ లాల్, కొత్త దర్శకులను ప్రోత్సహించారు; కొత్త రచయితలకు అవకాశం ఇచ్చారు; కొత్త నటీనటులను వెలుగులోకి తెచ్చారు; నిర్మాణంలో కొత్త వరవడులు

పెట్టి – అనేకమందికి ఆ పద్ధతులు నేర్పారు; చక్కని నిర్మాతలుగా వారిని రూపొందించారు; చిత్రాన్ని పంపిణీ చెయ్యడంలో కూడా ఆయన అవలంభించిన పద్ధతులూ, చిట్కాలూ అనేకులకు తెలుసును.

"ఏ ఏ ప్రదేశాల్లో – ఏ ఏ కాలాల్లో ప్రేక్షకులు సినిమాలు చూస్తారు – అన్నది కూడా ముఖ్యాంశాం. అది కనిపెట్టి చిత్రాలు విడుదల చేస్తూ వుండాలి. పండగలూ, పబ్బాలప్పుడూ, ప్రజల దగ్గర డబ్బు వుండే సమయాల్లోనూ చిత్రాలను విడుదల చెయ్యాలి. వానాకాలం, కోతలకాలం – ఇలాంటి సమయాలు కనిపెడుతూ వుండాలి. కనిపెట్టి, చిత్రాలను విడుదల చేస్తూ వుండాలి" అన్నారు సుందర్ లాల్.

దక్షత, సామర్థ్యం, తెలివి తేటలూ గలవారు ఏ పరిశ్రమలోనైనా రాణిస్తారు. చిత్ర పరిశ్రమలో సుందర్ లాల్ నహతా రాణించడానికి ఇలాంటివే అనేక కారణాలు.

★ ★ ★ ★ ★ ★ ★ ★

ఈస్ట్ ఇండియా ఫిల్మ్ కంపెనీ అధినేత చమ్రియా – చమ్రియాటాకీ డిస్ట్రిబ్యూటర్స్ పేరిట మద్రాసులో కూడా ఒక శాఖను ఆరంభించిదలచికున్నారు. బాధ్యతాయుతంగా పని చెయ్యగల, ఉత్సాహవంతులైన యువకులను ఆ సంస్థలో పెట్టాలని చమ్రియా ఆశించారు. ఆ సమయంలోనే సుందర్ లాల్, చమ్రియాకు తటస్థపడ్డారు.

సుందర్ లాల్, అప్పుడే కలకత్తా యూనివర్శిటీలో బి. కామ్. డిగ్రీ తీసుకున్నారు. చమ్రియా ఆ యువకుణ్ణి ఎగాదిగా పరీక్షించి చూశారు. 'అబ్బాయి ధీమాగా నించున్నాడు; తెలివితేటలు ముఖంలోనే ఉట్టిపడుతున్నాయి; పెల్లుబుకుతున్న ఉత్సాహం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది' అనుకున్నారు చమ్రియా.

"నువ్వు నా మద్రాసు శాఖకు మేనేజరువి" అన్నారాయన – ఒక్క ముక్కలో. సుందర్ లాల్ ఆశ్చర్యంగా చుశారు.

"క్షమించండి. నాకు సినిమా పిచ్చి వున్న మాట నిజమే; విడవకుండా – వచ్చే ప్రతి సినిమా చూస్తానన్నమాట నిజమే. అయితే అంత మాత్రాన, సినిమా పరిశ్రమ గురించి నాకు బాగా తెలుసు అని నేను అనుకోవడం లేదు. నా విషయంలో మీరు బాగా ఆలోచించుకుని గాని, ఒక నిర్ణయానికి రావద్దని నా ప్రార్థన" అన్నారు సుందర్ లాల్, వినయంగా.

"నువ్వు నాకు తెలుసు; మా కుటుంబానికీ నువ్వు తెలుసు; నువ్వు వ్యవహారాలు ఎలా నడపగలవో నీకు తెలియక పోయినా, నాకు తెలుసు. అంచేత నిన్ను నేను తయారు చేసుకోగలను" అన్నారు చమ్రియా.

సుందర్ లాల్ ఇంకేం మాట్లాడలేదు. చమ్రియా టాకీ డిస్ట్రిబ్యూటర్స్ మద్రాసు శాఖకు మేనేజరుగా వచ్చారాయన. అది – 1941 వ సంవత్సరం.

నేటి రాజశ్రీ పిక్చర్స్ అధిపతి, తారాచంద్ బర్జాత్యా కూడా అప్పుదు చమ్రియాతో వుండేవారు. చిత్ర పరిశ్రమలో వున్న దాదాపు అన్ని శాఖలతోనూ తారాచంద్ కు పరిచయం వున్నది; ఆ పరిజ్ఞానమూ వున్నది. తన అనుభవాల్నీ తనకున్న పరిజ్ఞానాన్నీ పురస్కరించుకుని, తారాచంద్, సుందర్ లాల్ కు అనేక విషయాలు నేర్పారు. చిత్ర నిర్మాణం అంటే ఏమిటి – పంపిణీ చెయ్యడం అంటే ఏమిటి – చిత్రాలకు పెట్టుబడి పెట్టే విధానాలు ఎలా వుండాలి – మొదలైన అనేక విషయాలను సుందర్ లాల్ అర్థం చేసుకున్నారు; వంట బట్టించుకున్నారు.

కొంత కాలానికి చమ్రియా జోస్యం నిజమైంది. వారి మద్రాసు శాఖను సుందర్ లాల్ కట్టుదిట్టంగా, సమర్ధవంతంగా నిర్వహించసాగారు. సుందర్ లాల్ వ్యవహార నైపుణ్యాన్ని చూసి, చమ్రియా ముచ్చటపడ్డారు.

"నువ్వు – నేను అనుకున్న దానికంటె గట్టివాడివి. నీ పనితనం నాకు నచ్చింది. నిన్ను నా సంస్థలో భాగస్వామిని చేస్తున్నాను" అన్నారు చమ్రియా.

ఆ క్షణం నుంచీ సుందర్ లాల్ ఆ సంస్థలో భాగస్వామిగా మారి, చమ్రియాతో సమానమైన హోదాకు వచ్చారు. మేనేజరుగా చేరిన వ్యక్తి భాగస్వామి కాగలిగాడంటే – దానికి ఎంత సామర్ధ్యం కావాలో, వ్యవహార దక్షత కావాలో వూహించిన వారికే అర్థమవుతుంది.

"చమ్రియా ఎన్నడూ నన్నొక పనివాడిగా చూడలేదు. సొంత బిడ్డలా ఆదరించారు. నా మీద ఆయన చూపిన వాత్సల్యం మరువరానిది. నేనంటే ఆయనకు ఎంతో అభిమానం వుండేది. నేను కూడా ఆయన్ని యజమానిగా ఎన్నడూ భావించలేదు; కుటుంబంలోని ముఖ్యునిగానే భావించాను. 41 లో ఆయనతో కలిగిన పరిచయం 1967 వచ్చేసరికి ఎంతో స్నేహంగా మారింది. 67 లో ఆయన మృతి చెందారు. అటువంటి వ్యక్తిని పోగొట్టుకున్నందుకు నేనెంతగా కుమిలి పోయి వుంటానో, ఎంతగా దుఃఖించి వుంటానో ఎవరూ అంచనా కట్టలేరు" అన్నారు నహతా రుద్ధ కంఠంతో.

తారాచంద్ బర్జాత్యా 1966 వరకూ చమ్రియాతో వున్నారు. తర్వాత ఆయన చమ్రియాను విడిచిపెట్టి – వేరే వెళ్ళిపోయారు. తారాచంద్, సుందర్ లాల్ ఇద్దరూ చిత్రాల పంపిణీ కార్యక్రమాల్లో సమాన హోదాలోనే పని చేశారు.

యుద్ధ భయం వల్ల 1943 లో చమ్రియా సంస్థ విజయవాడకు తరిలించబడ్డది. అక్కణ్ణుంచీ పది సంవత్సరాలపాటు ఆ సంస్థ విజయవాడలోనే వున్నది. ఆ పది సంవత్సరాల కాలంలోనూ, చమ్రియాసంస్థను చూసుకుంటూ – తెలుగు చలన చిత్ర పరిశ్రమకు అనేక సహాయాలు చేశారు నహతా. తెలుగు చిత్ర పరిశ్రమను వెలుగులోకి తీసుకు రావడానికి ఎంతగానో శ్రమించారు. ఆ సమయంలోనే ఆయన, ఆంధ్ర చలనచిత్ర వాణిజ్య మండలికి అధ్యక్షుడిగా కూడా ఎన్నికయినారు.

సినిమా థియేటర్లో చూపించబడే, వార్తా చిత్రాలకు ప్రభుత్వం, థియేటర్ యజమానుల వద్ద వసూలు చేస్తున్న మొత్తం చాలా ఎక్కువనీ, ఆ మొత్తాన్ని తగ్గించవలసిందనీ – తగ్గించేదాకా వార్తా చిత్రాల ప్రదర్శనను నిలిపి వేయవలసిందిగా ఉత్తరువు జారీ చెయ్యాలని – ఆంధ్ర ఫిల్మ్ వాణిజ్య మండలి కోర్టువారిని కోరింది.

దాంతో, అప్పుడు కేంద్ర సమాచార శాఖా మంత్రిగా వుంటున్న బి.వి.కేస్కర్, విజయవాడలో ఒక అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి, వాణిజ్య మండలితో సంప్రతించి, వార్తా చిత్రాల అద్దెను తగ్గించారు. థియేటర్లో ఒక చిత్రానికి వసూలైన మొత్తాన్ని బట్టే, ఆ అద్దె కూడా వుండేట్టుగా ఆమోదించారు. అప్పుడు సుందర్ లాల్ మండలికి అధ్యక్షులు. ఆయన ఆధ్వర్యంలో అలాంటి ఉద్యమాలు ఎన్నో సాగాయి.

1950 వ సంవత్సరంలో సుందర్ లాల్ నహతా తారాచంద్ బర్జాత్యాతో కలిసి రాజశ్రీ పిక్చర్స్ అన్న సంస్థను స్థాపించారు. ఆ సంస్థ చిత్రాలను నిర్మిస్తుంది; విడుదల చేస్తుంది. అక్కడి నుంచీ సుందర్ లాల్ చిత్ర నిర్మాతగా మారారు. తెలుగు, తమిళ భాషలలో అనేక చిత్రాలు నిర్మించారు; విడుదల చెశారు.

శ్రీ ప్రొడక్షన్స్, రాజలక్ష్మీ ప్రొడక్షన్స్, విజయలక్ష్మీ పిక్చర్స్ మొదలైన సంస్థలను కూడా సుందర్ లాల్ ఆరంభించి, చిత్ర నిర్మాణం చేశారు. ఆయన నిర్మంచిన చిత్రాల్లో అనేక చిత్రాలు అఖండవిజయం పొందిన చిత్రాలు. 'ప్రేక్షకులు ఏ రకమైన చిత్రాలను ఆదరిస్తారు?' అన్న విషయం ఆయనకు బాగా తెలుసు అనడానికి – అది తార్కాణం.

"సినిమా ముఖ్యమైన ఉద్దేశం ప్రజలకు వినోదాన్ని కల్పించడం. వినోదంతోపాటు ప్రయోజనం వుండడం కూడా ముఖ్యమైనదే. చిత్రాలు ప్రజలకోసమే తీస్తున్నాము కాబట్టి – వారు మెచ్చే విధంగా తియ్యడమే సమంజసమైనదీ, సబబైనదీ. వినోదంతో పాటు సాంఘిక ప్రయోజనం కూడా వుండాలన్నది నా ఉద్దేశం" అన్నారు సుందర్ లాల్.

ఆయన నిర్మించిన చిత్రాల్లో ఆయనకు బాగా వచ్చిన చిత్రం – శాంతినివాసం.

"ఎందువల్ల?"

"ఆ చిత్ర కథలో ప్రయోజనం వున్నది. చక్కని కుటుంబగాథ; మంచి నీతిగల కథా. దానికి తోడు వినోదానికీ మంచి అవకాశం వున్నది. అందుకనే, ఆ చిత్రాన్ని జెమినీ వారు హిందీలో నిర్మించగా, అనేక చోట్ల రజతోత్సవాలు జరుపుకున్నది" అన్నారు నహతా.

తెలుగులో వచ్చిన 'గూఢచారి – 116' ను ఆయన హిందీలో 'ఫర్జ్' పేరిట నిర్మించారు. ఆ చిత్రం అనేక కేంద్రాల్లో రజతోత్సవాలు జరుపుకున్నది.

"చిత్ర నిర్మాతగా, పంపిణీదారుగా, పెట్టుబడిదారుగా నేను చిత్ర పరిశ్రమలో అనేకమందిని ఎరుగుదును. ఏ వృత్తిలోనైనా విజయం సాధించాలంటే ఆ వృత్తిమీద శ్రద్ధ వుండాలి; తోడుగా పని చేసేవారి సహకారం వుండాలి. నా అదృష్టం వల్ల – నా చిత్రాలకు పని చేసిన టెక్నీషియన్ల, నటీనటుల సహకారం ఎంతగానో లభించింది." అన్నారు సుందర్ లాల్.

"ఇవాళ, అనేక చిత్ర నిర్మాణాలు ప్రారంభంలోనే ఆగిపోతున్నాయి. దానికి కారణం – ధనాభావం. పెట్టుబడి చూసుకోకుండా పరిశ్రమలోకి దిగటంవల్లనే ఇవి ఏర్పడుతున్నాయి. సరైన ఆర్థిక స్తోమత కలిగి వుంటే, ఇలాంటి ఇబ్బందులు రావు. అందుకనే, చిత్ర నిర్మాణంలోకి దిగేవారు – ముందుగా 'పెట్టుబడి' ని సవ్యంగా చూసుకోవాలి. ఒక నిర్ణయం చేసుకున్న తర్వాత దానికి కట్టుబడి వుండాలి. అలా పెట్టుబడి, కట్టుబడీ వుంటే – చిత్ర నిర్మాణం సులభ సాధ్యమవుతుంది; చిత్రం తొందరగా పూర్తవుతుంది; ఖర్చు తగ్గుతుంది." అన్నారాయన.

తాను నిర్మాతగా కావడానికి ముఖ్యమైన కారణం ఏమిటో సుందర్ లాల్ వివరించారు;

"ఇదివరలో డిస్ట్రిబ్యూటర్ గా మాత్రమే వుండేవాణ్ణి. మేము పంపిణీకి తీసుకున్న చిత్రాలను – ఫలానా తేదీకి ఇస్తామని థియేటర్లు బుక్ చేసుకునేవాళ్ళం. కాని, డబ్బులేకనో, ఇతర ఇబ్బందుల మూలంగానో అనుకున్న చిత్రం అనుకున్న కాలానికి వచ్చేదికాదు. దాంతో, ఏ పాత చిత్రాన్నో ఆడుకోవలసి వచ్చేది. ఇలాంటి ఇబ్బందులు కలగడంవల్ల – మనమే నిర్మాతలమైతే బాగుంటుంది గదా అనిపించింది. ఆ ఆలోచనే నన్ను నిర్మాతను చేసింది !"

ఇండోనీషియాలో రెండవ ఆసియా – ఆఫ్రికా చలన చిత్రోత్సవం జరిగినప్పుడు భారత చలన చిత్రాల తరపున ('నర్తనశాల' చిత్రంతో) సుందర్ లాల్ జకార్తా వెళ్ళి – ఆ ఉత్సవంలో పాల్గొన్నారు.

జర్మనీ ప్రభుత్వ ఆహ్వానాన్ని పురస్కరించుకుని, ఆయన, ఈ ఆగస్టులో జర్మనీలో జరగబోయే ఎగ్జిబిషన్ కు వెళుతున్నారు.

దక్షిణ భారత చలనచిత్ర వాణిజ్య మండలికి – సుందర్ లాల్ నహతా ఇప్పుడు అధ్యక్షులుగా వుంటున్నారు. చలనచిత్ర పరిశ్రమ మనుగడకు – ఆయన ఎన్నో పరిష్కార మార్గాలు కనిపెట్టారు – కనిపెడుతూనే వున్నారు.

"నేను ఇవాళ ఈ స్థితికి రావడానికి కారణం – కేవలం నా కృషీ, పట్టుదలా మాత్రమే కావు; నా మిత్రులూ, ప్రజలూ నాకు ఇచ్చిన ఆదరాభిమానాలూ, సహకారాలే ముఖ్య కారణం" అన్నారు నహతా – కృతజ్ఞతా సూచకమైన చిరునవ్వుతో.

COMMENTS